

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఖరారు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమీటీలు ఖారారు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆళ్లగడ్డ ఏఎంసీగా మైలేరీ సురేఖ(జనసేన), ఆత్మకూరు వెంకటకృష్ణారెడ్డి (టీడీపీ), కోవెలకుంట్ల మధులత (టీడీపీ) ఖరారు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.



జలహారతి ఇస్తున్న సీఎం చంద్రబాబు





మూడు పంపుల ద్వారా విడుదలవుతున్న నీరు



ప్రతి ఎకరాకూ నీరు

- సీమను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం
- హంద్రీ-నీవా ద్వారా సాగు, తాగు నీరు
- కర్నూలులో హైకోర్ట్ బెంచ్ ఏర్పాటు
- మల్యాల నుంచి హంద్రీ-నీవాకు నీటిని విడుదల చేసిన సీఎం చంద్రబాబు

నంద్యాల, జూలై17(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలతో రాయలసీమలోని ప్రతి ఎకరాకు నీళ్లివ్వడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీశైల మల్లన్న నీళ్లను.. తిరుపతి వెంకన్న వరకు తీసుకెళ్తామన్నారు. గురువారం నంద్యాల జిల్లా నందికొట్కూరు పర్యటనలో ఆయన ముందుగా మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు చేసి కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. ఆ తర్వాత మూడు మోటర్లను ఆన్‌చేసి నీరు వదిలారు. అనంతరం నందికొట్కూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ సీమ పరిధిలోని ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. హార్టికల్చర్ పంటలను మరింత పెంచి రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిపెట్టేలా చూస్తామన్నారు. రైతులకు అండగా ఉండేలా పలు సంక్షేమ పథకాలను అమలుచేస్తామన్నారు. పారిశ్రామికంగా సీమలోని నాలుగు జిల్లాలను విడతల వారిగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రధానంగా హంద్రీనీవా ద్వారా నీరు 600కిలోమీటర్లు ప్రవహించి చిత్తూరు జిల్లా కుప్పం వరకు వెళ్తాయన్నారు. హంద్రీ నీవా నీటితో రాయలసీమలోని 6లక్షల ఎకరాలకు సాగునీరు.. 33 లక్షల మందికి తాగునీరు అందిస్తున్నామన్నారు. రాయలసీమలోని ప్రతి ఎకరాకు నీరు ఇచ్చి కనీసం రెండు పంటలను వేసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మిగతా 6వ పేజీలో



రైతులతో చంద్రబాబు



ముఖ్యమంత్రికి సన్మానం



స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న సీఎం



ప్రాజెక్టు నమూనా పరిశీలన



అధికారులతో సీఎం



నీటిని పరిశీలిస్తూ..

రేపు స్పాట్ అడ్మిషన్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు డిప్లొమా సెకండియర్‌లో స్పాట్ అడ్మిషన్ కల్పిస్తున్నట్లు నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శైలేంద్రకుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటర్ ఒకేషనల్ కోర్సు పాస్ అయిన అభ్యర్థులు డిప్లొమాలోని మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో అడ్మిషన్లు పొందేందుకు అర్హులని తెలిపారు. సరైన ధ్రువపత్రాలతో శుక్రవారం సమీప ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో దరఖాస్తులు దాఖలు చేసుకోవచ్చన్నారు. కర్నూలులో మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం 19వ తేదీన స్పాట్ అడ్మిషన్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

రాతి సమాధులను పరిరక్షించుకోవాలి

- ట్రైనింగ్ రిటైర్డు లైఫ్ మెంబర్ ఆఫ్ ఏపీ హిస్టరీ కాంగ్రెస్ ఇన్‌స్పెక్టర్ జీఎస్ రామయ్య శర్మ



కోసిగి తిమ్మప్ప కొండలో రాతి సమాధులను పరిశీలిస్తున్న జీఎస్ రామయ్య శర్మ

కోసిగి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తిమ్మప్పకొండలో ఉన్న పూర్వకాలం నాటి రాతి సమాధులను స్థానికులు పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ట్రైనింగ్ రిటైర్డు లైఫ్ మెంబర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ ఇన్‌స్పెక్టర్ జీఎస్ రామయ్య శర్మ పేర్కొన్నారు. గురువారం శిలాయుగం నాటి రాతి సమాధులను స్థానికులతో కలిసి పరిశీలించారు. సుమారు ఈ కొండపై 200కు పైగా రాతి సమాధులు ఉన్నాయని, స్థానికు లు, గొర్రెల కాపరులకు తెలియక వాటిని ధ్వంసం చేయడం చాలా బాధాకరమన్నారు. ఇలాంటివి కడప జిల్లా రాయ చోటిలో కూడా ఉన్నట్లు గుర్తించామన్నారు. కోసిగి తిమ్మప్ప కొండలో కూడా క్రీస్తు పూర్వం నాటి ఆనవాళ్లు ఉన్నాయని, సుమారు వెయ్యి ఏళ్ల క్రితంగా ఇవి ఉండవచ్చని భావించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నంద్యాల రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని చాబోలు గ్రామంలోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో తపాలా ఉద్యోగుల 14వ ద్వైవార్షిక మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదో వేతన కమిటీలో జీడీఎస్‌లను చేర్చడంపై చర్చించారు. ప్రభుత్వం చర్చించి తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర డివిజన్ అధ్యక్షుడిగా కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శిగా మర్రెడ్డి, కోశాధికారి నారాయణ, రాష్ట్ర మహిళా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

నంద్యాల రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సాయిబాబా నగర్‌లోని భగత్‌సింగ్ గ్రంథాలయంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, గత ఏడాది ప్రజలపై మోపిన రూ.15,526 కోట్ల అదనపు భారాన్ని రద్దు చేయాలని అన్నారు. స్మార్ట్ మీటర్లను సైతం వెంటనే తొలగించాలని తీర్మానించారు. ఈ నెల 27న స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లను వ్యతిరేకిస్తూ భారీ సదస్సు నిర్వహించాలని, 23వ తేదీ నుంచి 29 వరకు ఇంటింటా ప్రచారంతో పాటు సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. 30వ తేదీ నుంచి ఆగస్టు 4 వరకు కాలనీల్లో సమావేశాలు నిర్వహించి, ఆగస్టు 4న విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టాలని తీర్మానించారు. సీపీఎం కార్యదర్శి రమేశ్‌కుమార్, ముస్లిం జేఏసీ కన్వీనర్ అబులైజ్, సీపీఐ జిల్లా నాయకుడు శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చింతల మోహన్‌రావు, భగత్‌సింగ్ గ్రంథాలయ చైర్మన్ శంకరయ్యతో పాటు పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రుణం తీర్చుకుంటా

- సీఎం చంద్రబాబు
- నందికొట్కూరు అభివృద్ధికి హామీ

నందికొట్కూరు నియోజకవర్గంలో 20 ఏళ్లుగా గెలవని టీడీపీని గెలిపించిన ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానని, ఆ బాధ్యత తనపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా గెలుపెరగని టీడీపీని ఈసారి నమ్మి ప్రజలు అధికారం ఇచ్చారన్నారు. అలాంటి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోడానికి తాను సిద్ధంగా ఉన్నానని, ఆ దిశగా ఇక్కడున్న ఎంపీ, ఎమ్మెల్యే కూడా పని చేయాలని అన్నారు. మల్యాల పర్యటన సందర్భంగా నందికొట్కూరు నియోజకవర్గంపై సీఎం హామీల జల్లు కురిపించారు.

- మిడ్తూరు మండలం కలమందలపాడు వద్ద మిడ్తూరు ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు అతి త్వరలోనే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. హంద్రీనీవా కాలువ 19వ కిలోమీటరు వద్ద రూ.60 కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 6 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు.
- నందికొట్కూరు మండలంలో మోడల్ ఏర్పాటు చేస్తామన్నారు.
- ప్రస్తుతం 30 పడకలు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు.
- అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు రూ.36 కోట్లు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తామన్నారు.
- 98 జీవో బాధితులకు కూడా న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

జూలైలోనే నీరు విడుదల : ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఎప్పుడూ లేని విధంగా జూలై నెలలోనే హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ద్వారా నీరు విడుదలైంది. నందికొట్కూరు నియోజకవర్గ చరిత్రలో ఈ రోజు నిలిచిపోతుంది. ఆసియాలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమైన హెచ్.ఎన్.ఎస్.ఎస్ ప్రాజెక్టుకు నీరు విడుదల చేసి రాయలసీమకు నీళ్లివ్వడం సంతోషించదగ్గ విషయం. నియోజకవర్గ ప్రజల కలగా ఉన్న మిడ్తూరు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయాలి. పట్టణంలోని 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి. బేడ బుడగజంగాలకు కుల ధృవీకరణ పత్రాన్ని అందజేయాలి.

రాయలసీమ రైతు బిడ్డ చంద్రబాబు నాయుడు: నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరి



రైతులకు సాగునీరు అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమ రైతుబిడ్డ. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పక్కనపెట్టి రైతులను నట్టేట ముంచింది. కూటమి ప్రభుత్వం రూ.3,890 కోట్లతో వంద రోజుల్లో హంద్రీనీవా విస్తరణ పనులు పూర్తి చేసింది. ఇది సీఎంకు ప్రాజెక్టులపై ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుంది. నందికొట్కూరు నియోజకవర్గంలో ఉన్న ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేయాలి. సిద్ధేశ్వరం అలుగును నిర్మించాలి.

కృష్ణమ్మకు జలహారతి

హంద్రీ-నీవాకు నీరు విడుదల చేసిన సీఎం చంద్రబాబు

నందికొట్కూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హంద్రీ-నీవా కాలువకు నీరు విడుదల చేస్తూ జలహారతి సమర్పించారు. గురువారం నందికొట్కూరు మండలం మల్యాల గ్రామం వద్ద శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా హెచ్.ఎన్.ఎస్.ఎస్ కాలువకు నీరు విడుదల చేశారు. అక్కడ ఇరిగేషన్ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి సీమ జిల్లాలకు వివిధ కాల్వలకు, రిజర్వాయర్లకు విడుదల చేసిన నీటిని సక్రమంగా వినియోగించుకునేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులకు బాబు సూచించారు. ఇరిగేషన్ శాఖ అంటే ప్రాజెక్టులు, కాల్వలే కాకుండా, భూగర్భ జలాల వినియోగం వంటివి కూడా చూసుకోవాలన్నారు. తిరుపతి వద్ద గాలేరు-నగరి, హంద్రీ-నీవా, సోమశిల- స్వర్ణముఖి కలిసేలా ప్రణాళికలు చేసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద పూజలు నిర్వహించి బటన్ నొక్కి మూడు పంపుల ద్వారా నీరు విడుదల చేశారు. అనంతరం హంద్రీనీవా కాలువ వద్దకు చేరి వేదమంత్రాల నడుమ కృష్ణమ్మకు పట్టువస్త్రాలు సమర్పించి జలహారతి ఇచ్చారు. చంద్రబాబు వెంట మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, నందికొట్కూరు ఎమ్మెల్యేలు గిత్తా జయసూర్య, బుడ్డా రాజశేఖరరెడ్డి, గుమ్మనూరు జయరాం, గౌరు చరితారెడ్డి, అఖిలప్రియ, మాజీ ఎమ్మెల్యేలు భూమా బ్రహ్మానందరెడ్డి, కోట్ల సుజాతమ్మ, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, మాండ్ర శివానందరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్, డీసీఎంస్ నాగేశ్వరరావు యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, రెవెన్యూ, పోలీసు అధికారులు తదితరులు ఉన్నారు.

- రైతుల ఘనస్వాగం: మల్యాల ఎత్తిపోతల పథకం వద్దకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రైతులు మల్యాల సర్పంచ్ ఉమాదేవి, మాజీ సర్పంచ్ గూడ్‌సాహెబ్ తదితరులు పూలమాల వేసి ఘనస్వాగతం పలికారు.

సీఎం పర్యటన సాగిందిలా..

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నందికొట్కూరు పర్యటన విజయవంతంగా ముగిసింది. గురువారం మధ్యాహ్నం 12.59 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో అల్లూరు గ్రామానికి బయలుదేరి 1.08 గంటలకు అల్లూరు గ్రామంలోని ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు.

- అక్కడ మంత్రులు, ఎమ్మెల్యే, అధికారులు సీఎంకు ఘన స్వాగతం పలికారు.
- 1.25 గంటలకు అల్లూరు నుంచి బయలుదేరి 1.40 గంటలకు మల్యాల పంపింగ్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలతో పండితులు ఆహ్వానం పలికారు.
- 1.53 గంటలకు పూజలు చేసి బటన్ నొక్కి మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా హెచ్.ఎన్.ఎస్.ఎస్.కు నీటిని విడుదల చేశారు.
- 2.04 గంటలకు హంద్రీనీవా వద్ద ముఖ్యమంత్రి జలహారతి ఇచ్చారు.
- 2.10 వరకు సీఎంకు ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య రైతులను పరిచయం చేశారు.
- 2.11 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 2.25కు మల్యాల క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు.
- 2.14 గంటలకు సభ ప్రారంభమైంది.
- 2.52 గంటలకు సీఎం ప్రసంగం ప్రారంభించి 3.56 గంటలకు ముగించారు.
- 4 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 4.05 గంటలకు అల్లూరు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు.
- 4.36 గంటలకు నందికొట్కూరు మల్యాల గ్రామంలో సీఎం పర్యటను ముగించుకొని ఓర్వకల్లు విమానాశ్రయానికి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి వెళ్లారు.



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు

రాయలసీమ ద్రోహి జగన్మోహన్‌రెడ్డి: నిమ్మల రామానాయుడు, జలవనరులశాఖ మంత్రి



హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ విస్తరణ పనులు చేపడతానని రాయలసీమకు ఏ ముఖ్యమంత్రీ చేయని ద్రోహం జగన్మోహన్‌రెడ్డి చేశారు. ఆనాడు జగన్ హంద్రీనీవా విస్తరణ పనులను ప్రారంభించి మూడు నెలల్లో పూర్తి చేస్తానని 2019 ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఒక్క తట్టమట్టికూడా వేయలేదు. చివరికి విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేదు. 1995లో నందమూరి తారక రామారావు హంద్రీ నీవాకు బీజం వేస్తే... చంద్రబాబు నాయుడు 3,850 క్యూసెక్కుల సామర్థ్యం గల పంపుల ద్వారా రాయలసీమలోని 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు.

గంట గంటకు జగన్మోహన్‌రెడ్డి దిగజారుతున్నారు : పయ్యావుల కేశవ్, ఆర్థికశాఖ మంత్రి



రోజురోజుకు ఎదిగే వ్యక్తి చంద్రబాబు నాయుడు, గంట గంటకు దిగజారిపోయే వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి. వైసీపీ గత ఐదేళ్ల కాలంలో హంద్రీ నీవా కాలువ విస్తరణ పనులకు ఒక్క తట్ట మట్టి కూడా వేయలేదు. రప్పారప్పా నరుకుతాం...రక్తపాతం, అశాంతి సృష్టిస్తాం అని వాళ్లు అంటే ... అభివృద్ధి, సాగునీరు అందించే సుపరిపాలన కోసం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు.



పాల్గొన్న రైతులు

ప్రతి ఎకరాకూ నీరు

5వ పేజీ తరువాయి

వేదవతి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి..ఆలూరు, ఆదోని, మంత్రాలయం నియోజక వర్గాలకు సాగునీరు ఇస్తామన్నారు. గోరకల్లు మరమ్మతులకు రూ.96 కోట్లు మంజూరు చేస్తామన్నారు. అలగనూరు జలాశయానికి రూ. 36 కోట్లు విడుదల చేసి పూర్తి చేస్తామన్నారు. మిట్నూరులో లిఫ్ట్ ఇరిగేషన్ కింద కలవందలపాడు, హంద్రీనీవా సుజల స్రవంతి కెనాల నుంచి 19వ కిలోమీటర్‌లో ఒక లిఫ్ట్ పెడితే 6వేల ఎకరాలకు సుభిక్షమవుతుందని స్థానిక రైతులు చెప్పారు. దీని కోసం రూ. 60 కోట్లు విడుదల చేస్తామన్నారు. నియోజకవర్గంలో ఒక మోడల్ స్కూల్, ఆస్పత్రి పడకలను పెంచుతామని ప్రజలకు వరాల జల్లు కురిపించారు. 98జీవో ప్రకారం బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కర్నూలు జిల్లాలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. రాయలసీమకు నీళ్లిచ్చానన్న సంతృప్తి జీవితంలో ఎప్పటికీ మరవలేనన్నారు. త్వరలోనే హంద్రీనీవా ఫేజ్-2 పనులు పూర్తి చేసి సత్యసాయి జిల్లాలోని మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి, అన్నమయ్య జిల్లాలోని శ్రీనివాసపురం, అడివిపల్లి రిజర్వాయర్లు నింపుతామన్నారు. సుపరిపాలనతో తొలి అడుగు వేశామన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు అద్భుత విజయం అందించారన్నారు. ఇచ్చిన హామీల పరంగా.. ఒకటో తేదినే పింఛన్ అందజేస్తున్నామన్నారు. తల్లికి వందనం అందరికి వర్తింప చేస్తున్నామన్నారు. 207 అన్న క్యాంటీన్‌లు పెట్టి పేద ప్రజల కడుపు నింపుతున్నామన్నారు. అన్నదాత సుఖీభవ కూడా త్వరలోనే అందజేస్తామన్నారు. రాయలసీమను రతనాల సీమ మార్చడంతో పాటు రాష్ట్రానికే మణిహారంగా సీమను తయారు చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీ నీవా నుంచి చిత్తూరుకు నీరు తీసుకెళ్లి ఎన్టీఆర్ కలను టీడీపీ నెరవేర్చిందన్నారు. కర్నూలు జిల్లాలోని కృష్ణగిరి, పత్తికొండ, అనంతపురం జీడీపల్లి రిజర్వాయర్లను త్వరలోనే నింపుతామన్నారు.

కాలువల్లో కృష్ణమ్మ పరవళ్లు..

సీఎం చంద్రబాబు చేతులు మీదుగా నీటిని విడుదల చేయడంతో సీమలోని కూటమి శ్రేణలతో పాటు రైతుల్లో సంతోషం రెట్టింపైంది. ఇదే క్రమంలో హంద్రీ నీవా కాలువల్లో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. తరలివచ్చిన టీడీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పలు సాగునీటి సంఘాలు, రైతులు తదితర వారితో నందికొట్కూరు కిక్కిరిసిపోయింది.

జలానికి పూజలు చేసి నమస్కరిస్తున్న చేస్తున్న సీఎం చంద్రబాబు



సీమకు ద్రోహం చేసిన జగన్

- ఐదేళ్లలో హంద్రీనీవా విస్తరణకు గంపెడు మట్టి తీయని వైసీపీ ప్రభుత్వం
- గుండ్రేవులపై తెలంగాణతో చర్చిస్తాం
- కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలకు లేఖలు రాశాం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు
- సీమ ప్రాజెక్టులపై ఇంజనీర్లతో సమీక్ష

కర్నూలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నాటి సీఎం జగన్ సాగునీటి ప్రాజెక్టులు అటకెక్కించి రాయలసీమకు తీరని ద్రోహం చేశారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. గురువారం హంద్రీ నీవా కాలువకు సీఎం చంద్రబాబు కృష్ణాజలాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి కర్నూలుకు వచ్చిన మంత్రి నిమ్మల స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో రాయలసీమ ప్రాజెక్టులపై ఇంజనీర్లతో సమీక్షించారు. కలెక్టరు పి. రంజిత్‌బాషా, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో జిల్లా అభివృద్ధిపై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం కరువు, వలసలు నివారణకు గుండ్రేవుల, వేదావతి, ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు. గుండ్రేవుల జలాశయం నిర్మాణం విషయంలో అంతర్రాష్ట్ర సమస్యలు ఉన్న మాట నిజమేనన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంపై కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలకు లేఖలు రాశామని పేర్కొన్నారు. ఆ రాష్ట్రాల నుంచి సమాధానం రాలేదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి సానకూల నిర్ణయం తీసుకొని గుండ్రేవుల నిర్మాణంపై ముందుకు వెళ్తామని తెలిపారు. హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పత్తికొండ(పందికోన) జలాశయం కుడి, ఎడమ కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాలువలు అసంపూర్తిగా ఉన్న విషయం, రూ.210 కోట్లతో పంపిన ప్రతిపాదన ఫైలు తన వద్దకు రాలేదని తెలిపారు. ఇంజనీర్లతో చర్చించి ఆ ఫైలు తెప్పించుకోవడంతో పాటు తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కాలువలు పూర్తి చేస్తే పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 65 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది.



కర్నూలు ప్రభుత్వ అతిథి గృహంలో కలెక్టరు, సీఈలు, ఇంజనీర్లతో సమీక్షిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు

ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులు..

వైసీపీ హయాలో ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులను భ్రష్టు పట్టించారని మంత్రి నిమ్మల ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు హంద్రీనీవా కాల్వ విస్తరణ చేపట్టారని, ఆ తరువాత వచ్చిన జగన్ 2020 ఆఖరిలోగా విస్తరణ పూర్తి చేస్తానని ప్రగల్భాలు పలికి గంపెడు మట్టి తీయలేదు.. అరబస్తా సిమెంట్ వేయలేదని అన్నారు. జగన్ సీమకు ద్రోహం చేస్తే.. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు 120 రోజుల్లో 400.500 కి.మీలు హంద్రీనీవా కాలువ, కుప్పం, పుంగనూరు బ్రాంచి కాలువలు విస్తరణ, లైనింగ్ పనులు చేసి రికార్డు సృష్టించారని తెలిపారు. జగన్ విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేదని, రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.18వేల కోట్లు బిల్లులు పెండింగులో పెట్టారని అన్నారు. 2028 డిసెంబరు ఆఖరిలోగా పొలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. పొలవరం - బనకచర్ల ప్రాజెక్టు కరువుసీమ రాయలసీమకు జీవనాడి అవుతుందని, గోదావరి జలాలు తెచ్చి ఆప్రాంతాన్ని పచ్చని పైరుగా మార్చేందుకు చంద్రబాబు భగీరథుడిలా కృషి చేస్తుంటే, జగన్ అడ్డుకునే కుట్రలకు తెర తీశారని ఆరోపించారు.

కాలువలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జలాశయాలు నిండి గేట్లు ఎత్తడంతో పాటు కాలువలకు నీటిని విడుదల చేస్తున్నామని, కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి నిమ్మల రామానా యుడు సూచించారు. హంద్రీనీవా ప్రాజెక్టు సీఈ నాగరాజు, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషా, ఎస్ఈ బాలచంద్రారెడ్డి సమీక్షలో పాల్గొన్నారు. తక్కువ ఖర్చు, ఎక్కువ ప్రయోజనాలు ఇచ్చే ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. జిల్లాలో వేదావతి, ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టులతో పాటు పత్తికొండ జలాశయం కుడి, ఎడమ కాలువల అసంపూర్తి పనులు పూర్తి చేయాల్సి ఉందని సీఈలు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. అంతర్రాష్ట్ర సమస్య లేని వేదావతి ప్రాజెక్టు తొలి ప్రాధాన్యతగా పనులు వేగం పెంచాలన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గుండ్రేవులపై మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. అలాగే.. నందికొట్కూరు మండలం మల్యాల లిఫ్ట్ వద్ద ప్రత్యేక బస్సులో సీఎం చంద్రబాబును కలిసి ఈ ప్రాజెక్టులపై ఇంజనీర్లతో చర్చించారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పాటించాలి



విద్యార్థితో మాట్లాడుతున్న శివప్రసాద్

మహానంది, జూలై 17(ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి శివప్రసాద్ ఆదేశించారు. గురువారం మహానంది సమీపంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యాబోధనను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీ లించారు. సీజనల్ వ్యాధుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రధానోపాధ్యాయుడు సత్యాలుకు సూచనలు ఇచ్చారు. ఇటీవల బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు విద్యాబోధనకు సంబంధించిన అంశాలపై అవ గాహన కల్పించారు. ఆయన వెంట స్థానిక సిబ్బంది ఉన్నారు.

శ్రీమఠానికి బియ్యం విరాళం

మంత్రాలయం, జూలై 17(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన సుధా మంజునాథ్, సుధీంద్ర 50 కేజీలు గల 100 బస్తాల బియ్యాన్ని విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జ్యోషి, సురేష్ కొణాపూర్ తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని శ్రీమఠం అన్నదానానికి బియ్యంను విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శ్రీరాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్టోర్ ఇన్‌చార్జులు బద్రీనాథ్, నారాయణరావు, అనంతపురాణిక్, శ్రీపాధాచార్, సుజ్ఞానేంద్ర ఆచార్‌లు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాతో నిఘా

• ఇద్దరు మద్యం ప్రియులపై కేసు నమోదు



డ్రోన్‌తో చిత్రీకరించిన ప్రాంతం

రుద్రవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం పోలీసుస్టేషన్ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టినట్లు ఎస్‌ఐ మహ్మద్‌రఫి తెలిపారు. గురువారం రుద్రవరం పరిసర ప్రాంతాల్లో క్యూఆర్‌టీ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాతో పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఓపెన్‌గా మద్యం సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు.

విషాహారంతో 32 కోళ్లు మృతి



మృతిచెందిన కోళ్లు

రుద్రవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన సత్యం అనే వ్యక్తి పొలం గ్రామానికి దగ్గరగా ఉంది. పొలంలో విషాహారం చల్లడంతో అది తిని గురువారం 32 కోళ్లు చనిపోయాయని బాధితులు నాగార్జున, నాగేంద్ర ఆవేదన చెందారు. ఈ ఘటనపై రుద్రవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు బాధితులు తెలిపారు. కోళ్లు చనిపోవడంతో 20వేల వరకు నష్టం జరిగిందన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఆదోని, జూలై17(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పట్టణ సమీపంలోని పైకొట్టాల వద్ద చోటుచేసు కున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. వివరాలు.. ఆదోని-ఇస్వీ రైల్వేస్టేషన్ల మధ్య గురువారం గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి వద్ద ఎలాంటి ఆధా రాలు లభ్యం కాలేదు. చేతిపై గుజరాతి భాషలో పచ్చబొట్టు ఉందని, దానికి పిల్లన గ్రోవి సింబల్ వేసి ఉందన్నారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి అయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రంగస్వామి (ఫైల్)

దేవనకొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓరైతు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన మండలంలోని గుడిమిరాళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు గువ్వల రంగస్వామి(46) తనకున్న మూడు ఎకరాల పొలం వ్యవసా యంతో పాటు గొర్రెల పెంపకం చేసేవాడు. పంటలు సరిగా పండక, గొర్రెలు సైతం వ్యాధుల బారినపడ్డాయి. దీంతో రూ.8లక్షలకు పైగా అప్పులు అయ్యాయి. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. అయినా అప్పుల తీర్చే మార్గం కనపడ కపోవడంతో గురువారం తన ఇంట్లో పురుగుమందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి చికిత్స కోసం అంబులెన్స్‌లో దేవనకొండకు తరలించారు. మార్గమధ్య లోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య హనుమంతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వ్యక్తి అనుమానస్పద మృతి

మంత్రాలయం, జూలై 17(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఆర్టీసీ బస్టాండు సమీపంలో కర్ణాటకలోని మల్కాపురం గ్రామానికి చెందిన యంకమ్మ కొడుకు దుల్లయ్య (35) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. దుల్లయ్య స్థానిక హోటల్‌లో పని చేస్తూ జీవనం సాగించేవారు. తల్లి యంకమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితి మృతిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మంత్రాలయం ఎస్‌ఐ శివాంజల్ తెలిపారు.

మరణించాడు.. ప్రాణదాత అయ్యాడు..!

• యువకుడు బ్రెయిన్ డెడ్ • నలుగురికి అవయవదానం
• తల్లిదండ్రులను అభినందించిన వైద్యులు



నివాళి అర్పిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో



తరుణ్ (ఫైల్)

కర్నూలు హాస్పిటల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన యువకుడు అవయవదానంతో ప్రాణదాత అయ్యాడు. నంద్యాల జిల్లా పాములపాడు మండలం కొత్త బనకచర్ల చెందిన మొలక తరుణ్(21) అనంతపురం జిల్లాలో కియా మోటార్స్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ఈనెల 9వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. 10వ తేదీన కర్నూలు గౌరిగోపాల్ హాస్పిటల్‌కు తరలించారు. 14వ తేదీన మెరుగైన చికిత్సకోసం మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆయువకుడిని 16వ తేదీన మెడికవర్ హాస్పిటల్ వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. ఈపరిస్థితుల్లో యువకుని తల్లిదండ్రులు మొలకరాజు ఈశ్వరమ్మకు అవయవదానంపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు దాతృత్వాన్ని చాటుకుని అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో జీవన్‌దాన్ ద్వారా లైసెన్సు పొందడంతో గురువారం కర్నూలు మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌వోడీ డా.సాయిసుధీర్ నేతృత్వంలో మెడికవర్ హాస్పిటల్‌లో అవయవాలను సేకరించారు. అవయవ మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డా.అబ్దుల్ సమద్ (యురాలజిస్టు), డా.సిద్దార్థ హెరూర్(నెఫ్రాలజిస్టు) డా.ప్రవీణ్ (అనస్థీషియా) ద్వారా అవయవాలను సేకరించి గ్రీన్‌చానల్ ద్వారా కర్నూలు హైదరాబాదుకు తరలించారు. రెండు కిడ్నీల్లో ఒక కిడ్నీని కర్నూలు జీజీహెచ్‌కు, మరో కిడ్నీ, లివర్‌ను కర్నూలు కిమ్స్ హాస్పిటల్, లంగ్స్‌ను హైదరాబాదు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం అవయవదానంకు అంగీకరించిన తల్లిదండ్రులను ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్, మెడికవర్ హాస్పిటల్ కర్నూలు క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి అభినందించారు.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి

• హాస్పిటల్ ఫర్నిచర్, అద్దాలు ధ్వంసం చేసిన మృతురాలి కుటుంబ సభ్యులు
• కరెంటు స్తంభం ఎక్కిన రోగి బంధువు
• శ్రీచక్ర హాస్పిటల్ వద్ద ఉద్రిక్తత
• విచారణ జరపాలని మహిళ భర్త డిమాండ్



మృతురాలి బంధువుల దాడిలో ధ్వంసమైన ఆసుపత్రి అద్దాలు



ఆసుపత్రి వద్ద మృతురాలి బంధువులు



మృతి చెందిన అనిత

కర్నూలు హాస్పిటల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం వల్లే మహిళ చనిపోయిందని రోగి బంధువులు ఆగ్రహంతో గురువారం ఉదయం శ్రీచక్ర హాస్పిటల్ ఫర్నిచర్, అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటనతో హాస్పిటల్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. రోగి బంధువు ఒక్కరు కరెంటు స్తంభం ఎక్కారు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం జిల్లా పామిడికి చెందిన అనిత(21)కు కల్లూరు ఎస్టేట్‌కు చెందిన నాగేంద్రప్రసాద్‌తో ఏడాది క్రితం పెళ్లయింది. ఈ నెల 15వ తేదీన తీవ్ర చలి జ్వరం రావడంతో రోగిని భర్త సమీపంలో ఉన్న శ్రీచక్ర హాస్పిటల్ తీసుకువచ్చారు. ఫ్లూయిడ్స్ ఎక్కించి రెండు గంటలు వైద్యులు చికిత్స అందించి మందులు రాసి పంపించారు. 16వ తేదీ రాత్రి 11.30 గంటల సమయంలో అపస్మారక స్థితిలో రోగిని భర్త తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించి చూడగా.. రోగి అప్పటికే చనిపోయిందని నిర్ధారించారు. రోగిని అడ్మిషన్ చేసుకోకుండా వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని భర్త ఆరోపించారు.

హాస్పిటల్ సిబ్బందితో వాగ్వాదం

వైద్యులు నిర్లక్ష్యంతోనే రోగి మృతి చెందిందంటూ బంధువులు గురువారం ఉదయం హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. హాస్పిటల్ అద్దాలు, పర్నిచర్‌ను ధ్వంసం చేశారు. హాస్పిటల్ సిబ్బందితో వాగ్వాదం చేశారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని అదుపు చేసి బంధువులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనిత మృతదేహాన్ని శవపరీక్ష కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మందు వికటించడంతోనే..

వైద్యులు ఇచ్చిన మందులు వికటించడంతోనే నా భార్య మృతి చెందింది. ఈ నెల 15వ తేదీ చలిజ్వరంతో క్యాజువాలీకి తీసుకు వచ్చా. వైద్యులు ఫ్లూయిడ్స్ పెట్టి మందులు రాసి ఇచ్చారు. మళ్లీ 16వ తేదీ రాత్రి 11గంటలకు రోగిని తీసుకువచ్చాం. వైద్యులు ఐసీయూలో ఉంచి వైద్యం చేయాలని బతిమాలినా పట్టించుకోలేదు. రాసిన మందులకు బదులు మరో రకం మందులు ఇచ్చారు. తక్షణమే దీనిపై విచారణ జరిపించి హాస్పిటల్‌ను సీజ్ చేయాలి.

• నాగేంద్ర ప్రసాద్, మృతురాలి భర్త

అనిత మృతిలో వైద్యుల నిర్లక్ష్యం లేదు

• ఐఎంఏ, అప్నా నాయకులు

శ్రీచక్ర హాస్పిటల్‌లో రోగి అనిత మృతిచెందడంలో వైద్యుల నిర్లక్ష్యం ఏమాత్రం లేదని ఐఎంఏ అప్నా నాయ కులు, శ్రీచక్ర హాస్పిటల్ యజమాని డా.విజయకుమా ర్‌రెడ్డి తెలి పారు. గురువారం మధ్యాహ్నం ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డా.రామచంద్రనాయుడు, డాఎస్‌వీ రామ్మోహన్ రెడ్డి, అప్నా అధ్యక్ష, కార్యదర్శులు డా.వేణుగోపాల్, డా.బీజీ రాహుల్, సీనియర్ నాయకులు డా.బాల మద్దయ్యలతో కలిసి డా.విజయకుమార్‌రెడ్డి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. బ్రాడ్ డెత్ అయిన రోగిని సరిగ్గా చూడలేదని చెప్పడం సరికాదన్నారు. హాస్పిటల్ ఆస్తులను ధ్వంసం చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. మందులు వికటించడం అవాస్తవమన్నారు. 15వ తేదీ మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల సమయంలో రోగికి ప్రాథమిక చికిత్స అందించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఐఎంఏ, అప్నా నాయకులు

గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలకు ఆజ్యం



మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

• వైసీపీ తాటాకు చప్పళ్లకు భయపడం
• రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం
• ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
• మంత్రికి ఘనస్వాగతం పలికిన టీడీపీ నాయకులు

బనగానపల్లె, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రౌడీమూకలను, గూండాలను పరామర్శిస్తూ గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలకు ఆజ్యం పోస్తున్నారని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం యాగంటిపల్లె గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. మంత్రి బీసీకి గ్రామ టీడీపీ నాయకులు బండి మౌళీశ్వరరెడ్డి, కుమార్‌స్వామిరెడ్డి, మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె దస్తగిరి, మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి. టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా గ్రామంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి బీసీ మాట్లాడారు. వైసీపీ తాటాకు చప్పుళ్లకు టీడీపీ నాయకులు భయపడే ప్రసక్తేలేదని అన్నారు. ఎన్నికల వేళ తాము ఇచ్చిన సూపర్ సిక్స్‌ను అమలు చేస్తున్నామన్నారు. జగన్ పరదాల పాలన సాగించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. యాగంటిపల్లె గ్రామంలో తాను నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను కూడా అడ్డుకొని నీరు అందకుండా చేసిన ఘనత వైసీపీ నాయకులది అన్నారు. విజనరీ లీడర్ అయిన సీఎం చంద్రబాబునాయుడు లోటు బడ్జెట్ ఉన్నా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింప చేస్తున్నారన్నారు. విద్యా వ్యవస్థలో నారాలోకేశ్ విప్లవాత్మక మార్పులు తెచ్చి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. సుపరిపాలన కరపత్రాలు గ్రామంలో మంత్రి బీసీ పంపిణీ చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మౌళీశ్వర రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, బండి కుమార్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, దస్తగిరి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, భూషన్న, ఆర్‌సీ నాగిరెడ్డి, చిన్నస్వామి, షేక్షావలి, బాలనాయుడు, కృష్ణానాయక్, తిరుమలేశ్, డీలు నాగశ్రీనివాసులు, మధుసూదన్, ఏఈ సాయికృష్ణ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవోగా డాక్టర్ వెంకటరమణ



కర్నూలు హాస్పిటల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఇన్‌చార్జి సివిల్ సర్జన్(సీఎస్) ఆర్ఎంవోగా సీనియర్ వైద్యులు డా.టీసీహెచ్ వెంకటరమణ నియమితులయ్యారు. కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు వినతి మేరకు కర్నూలు మెడికల్ కాలేజీ ఎస్‌పీఎం డిపార్టుమెంటులో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న డా.వెంకటరమణను ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవోగా నియమిస్తూ గురువారం ప్రిన్సిపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కొవిడ్ సమయంలోనూ ఆర్ఎంవోగా ఆయన చేసిన సేవలను గుర్తించి వాటిని వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో హాస్పిటల్ సూపరింటెం డెంట్ ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవోగా నియమించినట్లు తెలిసింది.

మార్కెట్ పాలనాధీశులు



గోల్కొండ అజ్మత్‌బీ, జిందె శారద, ఆకెపోగు సుగుణమ్మ, చింతలగేని నర్సిరెడ్డి

• వ్యవసాయ మార్కెట్ యార్డులకు చైర్మన్లు ఎంపిక
• కర్నూలు చైర్మన్‌గా గోల్కొండ అజ్మత్‌బీ, ఆదోని చైర్మన్‌గా జిందె శారద
• కోడుమూరు చైర్మన్‌గా ఆకెపోగు సుగుణమ్మ, మంత్రాలయం చైర్మన్‌గా చింతలగేని నర్సిరెడ్డి
• అధికారికంగా ప్రకటించిన ప్రభుత్వం
• డైరెక్టర్లు ఎంపిక.. ఆ వెంటనే ఉత్తర్వులు జారీ

కర్నూలు, జూలై 17(ఆంధ్రజ్యోతి): తెలుగు తమ్ముళ్లను నామినేటెడ్ పదవులు వరించాయి. జిల్లాలో ఖాళీగా ఉన్న కర్నూలు, ఆదోని, కోడుమూరు, మంత్రాలయం (కోసిగి) వ్యవసాయ మార్కెట్ యార్డులకు పాలనాధీశులను ఎంపిక చేశారు. సుదీర్ఘ కాలంగా టీడీపీ అభివృద్ధి, బలోపేతం కోసం పనిచేసిన కార్యకర్తలకే అధిష్టానం పట్టం కట్టింది. డబ్బు బలంతో పదవుల కోసం ప్రయత్నాలు చేసిన నాయకులకు మొండి చూపించారు. తొలి జాబితా మార్కెట్ యార్డుల చైర్మన్ల ఎంపికలో, టీడీపీ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వస్తుందని వివిధ సర్వేలు తేల్చి చెప్పడంతో ఎన్నికల ముందు టీడీపీలో చేరి మాజీ వైసీపీ నాయకులకు పదవులు ఇచ్చి, పార్టీకోసం ప్రాణాలు అడ్డం పెట్టిన కార్యకర్తలను అన్యాయం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో అధిష్టానం ఇంరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్ఎస్) సర్వేలు చేసి పార్టీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకే పెద్దపీట వేసిందని తెలుస్తుంది. మార్కెట్ చైర్మన్ల ప్రభుత్వం గురువారం ప్రకటించింది. త్వరలోనే డైరెక్టర్ల ఎంపిక చేసి ఉత్తర్వులు జారీ చేస్తారని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.

కీలక మార్కెట్లకు మహిళా చైర్మన్లు

జిల్లాలో కీలకమైన కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా టీడీపీ మైనార్టీ విభాగం నగర అధ్యక్షుడు గోల్కొండ అబ్దుల్ అమీద్ సతీమణి గోల్కొండ అజ్మత్‌బీ అజ్మత్‌బీని అధిష్టానం ఎంపిక చేసింది. వీరి కుటుంబం 15 ఏళ్లకు పైగా టీడీపీలో కొనసాగుతుంది. మంత్రి టీజీ భరత్‌కు అత్యంత సన్నిహితంగా ఉంటున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో నాటి ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ సొంత వార్డులోనే టీడీపీ అభ్యర్థిగా వీరి కుటుంబం నుంచే పోటీ చేసి కార్పొరేటరుగా గెలిచారు. మార్కెట్ చైర్మన్ పీఠం కోసం పలువురు పోటీ పడినా, మంత్రి టీజీ భరత్ జి.అజ్మత్‌బీ పేరు ఒక్కటే ప్రతిపాదించడం, ఆమే చైర్మన్‌గా ఎంపిక కావడంతో పాతబస్తీలో టీజీ వర్గీయులు సంబరాలు చేసుకున్నారు. రాయలసీమలోనే అదిపెద్ద ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నేత జిందె శంకర్ సతీమణి జిందె శారదను ఎంపిక చేశారు. ఆదోని మార్కెట్ చైర్మన్ పీఠం కోసం కూటమి పార్టీల్లో పలువురు ముఖ్య నాయకులు పోటీ పడ్డారు. టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతినాయుడులు బీసీ సామాజికవర్గానికి చెందిన ముగ్గురు మహిళల పేర్లను సిఫార్సు చేశారు. ఐవీఆర్ఎస్ సర్వేలో జిందే శారద అగ్రస్థానంలో నిలవడంతో అధిష్టానం ఆమే పేరునే ఖరారు చేసింది. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నా పదవులు ఆశించకుండా పార్టీ కోసం పని చేశారు. మీనాక్షినాయుడు కుటుంబానికి సన్నిహితంగా ఉంటున్నారు. కష్టపడే కార్యకర్తలకే అధిష్టానం ప్రాధాన్యత ఇచ్చిందని, బాణా సంచకాల్చి సంబరాలు చేసుకున్నారు.

కార్యకర్తలకు పెద్దపీట

కోడమూరు మార్కెట్ చైర్మన్‌గా బి.తాండ్రపాడు సర్పంచి ఆకెపోగు జయన్న భార్య ఆకెపోగు సుగుణమ్మను ఎంపిక చేశారు. గత ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే టికెట్ కోసం జయన్న చివరి వరకు ప్రయత్నాలు చేశారు. కేడీసీసీ చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడుగా ఉంటున్నారు. జయన్న భార్య ఆకెపోగు సుగుణమ్మ పేరును కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సిఫార్సు మేరకు అధిష్టానం ఎంపిక చేసింది. ఆయన వర్గీయుల్లో సంబరాలు మిన్నంటాయి. మంత్రాలయం (కోసిగి) మార్కెట్ యార్డు చైర్మన్‌గా టీడీపీ కోసిగి పట్టణ అధ్యక్షుడు చింతలగేని నర్సిరెడ్డిని ఎంపిక చేశారు. టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఈయన పేరును సిఫార్సు చేశారు. టీడీపీలో 20 ఏళ్లకు పైగా నమ్మకమైన కార్యకర్తగా పని చేస్తున్నాడు. అయితే.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీ, కోసిగి సర్పంచి పదవి ఆశిస్తున్న ఈయన మార్కెట్ చైర్మన్ పదవిపై అయిష్టతో ఉన్నట్లు తెలుస్తుంది. నాలుగురు చైర్మన్లగా ఎంపిక అయితే.. ముగ్గురు మహిళలు కావడం కొసమెరుపు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గోస్పాడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోస్పాడులోని ఎరువుల దుకాణాల్లో గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. శ్రీవెంకటసాయి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్ షాప్‌లో విజిలెన్స్ అధికారి, సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, విజిలెన్స్ ఎస్సై గోపాలుడు, ఏవో స్వప్నిక తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాల్లేనందున రూ.8,13,200 విలువచేసే 17.12టన్నుల ఎవురుల బస్తాలను తాత్కాలికంగా నిలిపివేశారు. రైతులకు విక్రయించే ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీకే విక్రయించాలని, రైతులకు రశీదులు ఇవ్వాలని, ఎరువుల స్టాక్ నిల్వలను రిజిస్టర్‌లో పొందుపరచాలని సూచిం చారు. అక్రమాలకు పాల్పడితే దుకాణాల లైసెన్స్‌లను రద్దుచేస్తామని అధికారులు హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిడుతూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిడుతూరు, చెరుకుచెర్ల, తిమ్మాపురం, బైరాపురం, సుంకేసుల, ఖాజీపేట, చింతలపల్లి గ్రామాలకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ క్రాంతి కుమార్ తెలిపారు. మిడుతూరు సబ్‌స్టేషన్‌లో కొత్తగా బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకో వాలని పాఠశాలల కన్వీనర్ ఫ్లోరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6,7,8,9 తరగతుల్లో ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఈనెల 25న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాల్లోని తొమ్మిది పాఠశాలల్లో దరఖాస్తు ఫారం పొందవచ్చన్నారు. పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలను ఈ నెల 22, 23వ తేదీల్లో పాణ్యం మండలం నెరవాడ గ్రామంలోని జేపీబీసీడబ్ల్యూఆర్ స్కూల్‌లో అందజేసి హాల్‌టిక్కెట్ పొందాలని సూచించారు.

బనగానపల్లెలో అత్యధిక వర్షపాతం నమోదు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో బుధవారం పలు మండలాల్లో అత్యధిక వర్షాలు కురిశాయి. బనగానపల్లెలో బుధవారం 37.0ఎంఎం అత్యధిక వర్షపాతం నమోదైంది. నంద్యాల పట్టణంలో 32.0, కోవెలకుంట్ల 31.4, ఆళ్లగడ్డ 30.0, కొలిమిగుండ్లలో 30.0, ఆళ్లగడ్డలో 29.6, బేతంచర్ల 24.2, మహానంది 18.6, అవుకు 18.2, ఉయ్యాలవాడ 16.4, నంద్యాల రూరల్‌లో 15.6, చాగలమర్రి 13.8, దొర్నిపాడు 11.2, ప్యాపిలి 6.8, సంజామల 6.4, గోస్పాడు 6.2, పాణ్యం 6.0, రుద్రవరం 4.2, బండిఆత్మకూరు 3.2 ఎంఎం వర్షపాతం నమోదు అయ్యింది.

క్రీడల్లో రాణించాలి



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

నంద్యాల హాస్పిటల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్య, క్రీడల్లో సమానంగా రాణించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి అన్నారు. గురువారం పొన్నాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పీఆర్టీయూ నాయకులు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రీడా దుస్తులు అందించిన పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి డీవీ సుదర్శన్‌రెడ్డిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బజయ్య, పీఆర్టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌వీ భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయరావు, మండల అధ్యక్షుడు దస్తగిరి, జిల్లా నాయకుడు సుభాన్, ఫిజికల్ డైరెక్టర్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి

కొత్తపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పని సరియని, అయితే.. వారు ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా గుర్తుంటాయని కొత్తపల్లి మండల వెలుగు ఏరియా కోఆర్డినేటర్ పుల్లయ్య అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న వెలుగు సీసీలు ముర్తుజా, మదన కుమారీని సన్మానించారు. కార్యక్రమంలో సీసీలు రమణ, రత్నకుమారి, పుల్లయ్య, శివుడు, రామకృష్ణ, ఐక్య సంఘం లీడర్లు తిరుపతమ్మ, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో బీసీ కాలనీ

● తాగునీరు, విద్యుత్ స్తంభాల్లేక ఇబ్బందులు



విద్యుత్ స్తంభాల్లేని బీసీ కాలనీ

గోస్పాడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసురపాడు గ్రామంలో ఉన్న బీసీ కాలనీ సమస్యలతో సతమతమవుతోంది. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు తాగునీరు, వీధిలైట్లు, రోడ్లు ఏర్పాటు చేస్తామని చెబుతున్న మాటలు నీటిమూటలుగా మారుతున్నాయి. గ్రామంలో నూతనంగా ఏర్పడిన బీసీకాలనీలో డ్రైయిన్ల నిర్మాణం కోసం అడ్డంగా ఉన్నాయని ఆరు నెలల క్రితం విద్యుత్ స్తంభాలను తొలగించారు. డ్రైయిన్ల నిర్మాణం పూర్తయినా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యుత్‌కోసం కాలనీవాసులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. వీధిలైట్లు లేక రాత్రిపూట విషపురుగులతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. దోమల బెడద ఎక్కువైందని కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటుచేయాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకునే నాథుడేలేడని వాపోతున్నారు. కాలనీకి మంచినీటి పైప్‌లైన్ కూడా లేదని నీళ్లకోసం ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. తమ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

కాలనీలో విద్యుత్ స్తంభాల్లేకపోవడంతో రాత్రులు బయటకు రావాలంటే భయం భయంగా ఉంటుంది. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని అడిగితే అధికారులు పట్టించుకోవడంలేదు. రాత్రిపూట విషపురుగుల సంచారం ఎక్కువైంది.

\- నాగేంద్ర, స్థానికుడు



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య







చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం

పుష్పగుచ్ఛాలు అందించిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

నందికొట్కూరు రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి) : నందికొట్కూరు మండలం మల్యాల గ్రామంలో హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేసేందుకు వచ్చిన సీఎం చంద్రబాబుకు ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. గురువారం మధ్యాహ్నం 1.08 గంటలకు అల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడుకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు చేరుకున్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్యలు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు రోడ్డు మార్గంలో మల్యాల వద్దగల హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల ప్రాజెక్టు వద్దకు బయలు దేరారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్‌ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్యెల్యేలు జయసూర్య, భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖరెడ్డి గుమ్మనూరు జయరాం, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కలెక్టర్ రాజకుమారి గనియా, జేసీ విష్ణుచరణ్, ఎస్పీ అధిరాజ్ సింగ్, టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నాయకులు మహేష్‌నాయుడు, తమడపల్లె విక్టర్, జలవనరుల శాఖ సీఈలు కబీర్ బాషా, నాగరాజు, ప్రతాప్, అధికారులు ఉన్నారు. వీడ్కోలు సందర్భంగా టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ రాయల సీమ ప్రాంత రైతాంగానికి సకాలంలో నీరు విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పాల్గొన్నారు.



చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న మాండ్ర

నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలి

● సీఎంకు సీపీఎం నాయకులు వినతి

నందికొట్కూరు: నందికొట్కూరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సీపీఎం నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు నియోజకవర్గంలో నెలకొన్న 13 అంశాలను పరిష్కరించాలంటూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్ భాష, కర్ణ, ఓబులేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● 98 జీవో బాధితులకు న్యాయం చేయండి

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంతో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు 98 జీవో ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నంద్యాల జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. సీఎం చంద్రబాబుకు సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, ఐ.ఎఫ్.టి.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ్‌కుమార్, మజీదుమియా పాల్గొన్నారు.







చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణు చరణ్, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

సీఎం, మంత్రులకు ఎమ్మెల్యే గౌరు చరిత కృతజ్ఞతలు

గడివేముల: రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. గురువారం ఎమ్మెల్యే 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రాజెక్టుల నిర్వహణ గాలికొదిలేశారని అన్నారు. 2021లో అలగనూరు రిజర్వాయర్ కరకట్ట కృంగిపోయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అలగనూరు, గోరుకల్లు రిజర్వాయర్ల మరమ్మతుల ఆవశ్యకతపై సీఎం చంద్రబాబునాయుడు, నీటిపా రుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్‌ఎండీ ఫరూక్‌ల దృష్టికి తీసు కెళ్లామని అన్నారు. దాంతో హంద్రినీవాకు నీరు విడుదల చేసేందుకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మతు లకు రూ.96కోట్లు, అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు రూ.36 కో ట్లు నిధులు మంజూరు చేసి త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్ప డంపై ఎమ్మెల్యే గౌరుచరిత హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబును కలిసిన మార్కెట్‌యార్డ్ చైర్మన్

హంద్రినీవాకు నీరు విడుదల చేసేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఓర్వకల్లు విమానాశ్రయంలో పాణ్యం మార్కెట్ యార్డ్ చైర్మన్ అంగజాల గీత, టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు అంగజాల కృష్ణయాదవ్ గురువారం కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు.



అల్లూరు వద్ద సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్న మంత్రి బీసీ, మాండ్ర శివానందరెడ్డి

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

గడివేముల, జూలై 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. గురువారం మండలంలోని కరిమద్దెల, కొరపోలూరు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మంచి పాలన

బండిఆత్మకూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే మంచి పాలన సాధ్యమని క్లస్టర్ ఇన్‌చార్జి కంచర్ల చిన్న లింగారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జీసీ పాలెం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందించిన పథకాలను, చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మధు, మోహన్‌రావు, విజయకుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



కరిమద్దెలలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే



జీసీపాలెంలో కరపత్రాన్ని అందిస్తున్న టీడీపీ నాయకులు

యూరియా కోసం పడిగాపులు



మిడుతూరు సహకార సొసైటీ వద్ద యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు

మిడుతూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు యూరియా కోసం పడిగాపులు పడుతున్నారు. స్థానిక వీరుసాహేబ్‌పేట సహకార సొసైటీలో యూరియా నిల్వలు తక్కువగా ఉండటం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో యూరియా నిల్వలు లేనందు వల్ల స్థానిక సహకార సొసైటీలో గురువారం యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. ఈ విషయపై సొసైటీ అధికారులను వివరణ కోరగా పెట్టిన ఇండెంటు కంటే యూరియా స్టాకు తక్కువగా రావడం వల్ల రైతులకు సర్దుబాటు కాలేదన్నారు. మళ్లీ స్టాక్ కోసం ఇండెంటు పెట్టామన్నారు.

టర్మినేషన్ లెటర్ ఇవ్వడం అన్యాయం

నంద్యాల హాస్పిటల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎంఓయూ ప్రకారం వేతనాలు ఇవ్వాలని శాంతియుతంగా నిరసన తెలియజేసిన సెక్యూరిటీగార్డు సూపర్‌వైజర్లు చెన్నయ్య, నాగన్నలను అక్రమంగా తొలగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, బాలవెంకట్ అన్నారు. గురువారం నంద్యాలలోని జీజీహెచ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు సూపర్‌వైజర్లు విధులు బహిష్కరించి ఆస్పత్రి ఆవరణలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల నుంచి ఈగల్‌హంటర్ అనే సంస్థ కాంట్రాక్టర్ సెక్యూరిటీగార్డుల శ్రమను దోచుకుతిన్నారన్నారు. వేతనాలు పెంచమని అడిగితే టర్మినేషన్ లెటర్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. 45మంది పనిచేయాల్సిన ఆస్పత్రిలో 37మందితోనే విధులు నిర్వహించడం శోచనీయమన్నారు. కార్మికుల హక్కుల గురించి అడిగితే బెదిరించి ఉద్యోగాల్లోంచి తీసేసి వారి కుటుంబాలను రోడ్డుపాలు చేయడం అన్యాయమన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ సెక్యూరిటీగార్డు యూనియన్ నాయకులు నాగన్న, చెన్నయ్య, బాలయ్య, ఆది, రమణ, నరేష్, శ్రీను, జయరాజు, హైమావతి, లత తదితరులు పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో ధర్నా చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

వర్గీకరణ ఫలాలు అందరికీ అందేలా చూడాలి



కురుకుందలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూరురూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ ఫలాలు అందరికీ అందేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బాషపోగుల దరగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బుజ్జిమాదిగలు అన్నారు. గురువారం మండలంలోని కురుకుంద గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జెండాను ఎగురవేశారు. నాయకులు వాదం నాగశేషులు, దేవసహాయం, నాగయ్య, పుల్లయ్య, చిన్న వెంకటరమణ,చిలుక నాని, రామారావు, ముంతన్న, రంగస్వామి, భాస్కర్, లింగస్వామి, సంజీవ పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ



మహానందిలో శిక్షణ ఇస్తున్న ఎన్నికల కమిషన్ సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ

గడివేముల, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనూరాధ గురువారం బీఎల్‌వోలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వివిధ ఫారాలను పూర్తి చేయడానికి అవసరమైన విధానాలను, వాటికి సంబంధించిన సర్టిఫికెట్ల సేకరణపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితా సవరణలు, మార్పులు, చేర్పులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, తహసీల్దార్ సిబ్బంది సూరి పాల్గొన్నారు.

మహానందిలో... తహసీల్దార్ కార్యాలయం గురువారం బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. శ్రీశైలం నియోజక వర్గం ఎన్నికల కమిషన్ సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేసే సమయంలో నిష్పక్షపాతంగా బీఎల్‌వోలు వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సీసీ సురేంద్రనాథ్‌రెడ్డి, మండల ఎన్నికల డీఈవో మణికంఠ, గ్రామాల వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి: సీపీఐ



మాట్లాడుతున్న బాబాఫక్రుద్దీన్

గోస్పాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ అన్నారు. గురువారం గోస్పాడులో సీపీఐ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పేదలకు ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30, 31తేదీల్లో జోన్‌లో జరిగే శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. మండల కార్యదర్శి హరినాథ్, ప్రజానాట్యమండలి నాయకులు గోకారి, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, నాగరాజు, శివశంకర్, మౌలా పాల్గొన్నారు.

సైబర్ వలలో పడొద్దు

బండిఆత్మకూరు జూలై 17(ఆంధ్రజ్యోతి): యువత సైబర్ వలలో పడొద్దని ఎస్ఐ జగన్మోహన్ సూచించారు. గురువారం బండిఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ అత్యాశకు లోనై మోసాలకు గురి కావొద్దన్నారు. ఆడపిల్లలతో దురుసుగా ప్రవర్తించరాదని, ఆకతాయి చేష్టలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు హెల్ప్ లైన్ 1930, 1972, 100 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ జగన్మోహన్

కొత్తపల్లి మండల ఈవోఆర్‌డీగా సుబ్బారావు

కొత్తపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల గ్రామ పంచాయతీల విస్తరణాధికారి (ఈవోఆర్‌డీ)గా సుబ్బారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గోస్పాడు మండలంలోని యాలూరు మేజర్ గ్రామ పంచాయతీలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై కొత్తపల్లి మండలానికి వచ్చారు. ఈవోఆర్‌డీ సుబ్బారావు మాట్లాడుతూ మండల అభివృద్ధికి సహచర పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని కోరారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోండి: ఏఈ

పాణ్యం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని ఈఏ మధుసూదన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 19న నంద్యాల టెక్కెలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కార్యాలయ పవర్‌హౌస్ ప్రాంగణంలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం వరకు అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదాలత్ వేదికకు అధ్యక్షుడిగా విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస్, ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులుగా మధుకుమార్, స్వతంత్ర్య సభ్యులుగా లక్ష్మీదేవి వ్యవహరిస్తారన్నారు. నంద్యాల డివిజన్‌లోని వినియోగదారులు తమ సమస్యలను అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో 532 బస్తాల యూరియా

పాణ్యం, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని ఎంఏఓ జయప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పాణ్యం-1, కొనిదేడు, గోనవరం, ఎస్ కొత్తూరు, మద్దూరు, భూపనపాడు, బలపనూరు, కొండజూటూరు, నెరవాడ రైతు సేవా కేంద్రాల్లో ఒక్కొక్క కేంద్రంలో 532 బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మొత్తం 239.4 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు పాస్ పుస్తకం, బీ1 అడంగల్ తీసుకెళ్లి ఎకరాకు ఒక బస్తా చొప్పున గరిష్ఠంగా పది బస్తాలు పొందవచ్చన్నారు.

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే

డోన్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడును మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ కలిశారు. గురువారం హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేసేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ను కలిసి పూల మొక్కను అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ కృష్ణా జలాలు విడుదల చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అలాగే మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యతో పలు అంశాలపై చర్చించారు.

విధుల్లో నిర్లక్ష్యం వీడాలి

ఉయ్యాలవాడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): విధులల్లో నిర్లక్ష్యం వీడి పని చేయాలని పెద్దయమ్మనూరు గ్రామ వైద్యాధికారి వినోద్ కుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీ రిజిస్ట్రేషన్‌లు, ఎన్‌సీడీసీడీ సర్వేలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పీఎన్‌జెఏపై ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ప్రసవాలు ప్రభుత్వ వైద్యశాలల్లో జరిగేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీహెచ్‌ఈవో మునిస్వామి, సూపర్ వైజర్ దానమ్మ ఉన్నారు.

గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థులు

చాగలమర్రి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో చాగలమర్రి వాసవీ ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. గురువారం కళాశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 14 వరకు సత్యసాయి జిల్లా కదిరిలో జరిగిన సీనియర్ బేస్‌బాల్ పోటీల్లో కళాశాల నుంచి పాల్గొన్న విద్యార్థులు పండు, వసంత్, ధనుష్, వైష్ణవి అత్యంత ప్రతిభ చూపి గోల్డ్‌మెడల్ సాధించారన్నారు. ఈ సందర్భంగా అభినందించి ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రమణగుప్త, రఘురామ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షాబుద్దీన్, విశ్రాంత లెక్చరర్ రామకృష్ణభగవాన్, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థులను ప్రోత్సహించాలి

చాగలమర్రి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా బనవాసిలో ఉన్న జవహర్ నవోదయలో చేరేందుకు విద్యార్థులను ప్రోత్సహించాలని విద్యాలయ అధికారి సుబ్బయ్య కోరారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని గిరిజన, సెయింట్‌ఆన్స్, గుంతపాలెం ప్రాథమిక పాఠశాల, సంతమార్కెట్ పాఠశాలలో నవోదయ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈనెల 29 లోపు నవోదయ ఎంపిక పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో న్యామతుల్ల, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

బనగానపల్లెలో 37 ఎంఎం వర్షపాతం

బనగానపల్లె, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో 37మిల్లీ మీటర్ల (ఎంఎం) వర్షపాతం నమోదయింది. బుధవారం కురిసిన వర్షం రైతులకు ఊరటనిచ్చింది. అలాగే కోవెలకుంట్ల మండలంలో 31.4ఎం.ఎం. కొలిమిగుండ్ల మండలంలో 30 ఎంఎం. అవుకు మండలంలో 18.2 ఎంఎం. వర్షపాతం నమోదు కాగా సంజామల మండలంలో అత్యల్పంగా 6.4 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది.

నేడు వన్‌డే స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంపు

బనగానపల్లె, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నియోజకవర్గంలో తొలిసారి ఒకరోజు స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంపును శుక్రవారం నిర్వహిస్తున్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఈక్యాంపును ప్రారంభించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ సైన్సు సిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. సమగ్ర శిక్షా అభియాన్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బీ.శ్రీనివాసులు, ఏపీ సైన్సు సిటీ సీఈవో కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

ఏజీపీగా జాకీర్‌హుసేన్ నియామకం


బనగానపల్లె, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె సివిల్ కోర్టు ఏజీపీగా (అసిస్టెంట్ గవర్నర్ ప్లీడర్) జాకీర్‌హుసేన్ నియమితులైయ్యారు. ఈమేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. గురువారం ఏజీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఏజీపీగా తనను నియమించేందుకు కృషి చేసిన రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జాకీర్‌హుసేన్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వహిస్తామని తెలిపారు.

తూతూమంత్రంగా డీఐఈవో తనిఖీ

బేతంచెర్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రీడ్ కళాశాలను డీఐఈవో శంకర్‌నాయక్ గురువారం తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించారు. 'విద్యార్థుల భవితతో చెలగాటం' అనే శీర్షికను 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. పాణ్యం సిమెంటు జూనియర్ కళాశాల పునఃప్రారంభ కార్యక్రమానికి హాజరైన డీఐఈవో శంకర్ నాయకుడు రీడ్ (గ్రేస్) పాఠశాల, కళాశాలలను తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ బేతంచర్ల పట్టణంలోని రీడ్ కళాశాలపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

'కూటమి'లో ప్రజలు సంతోషంగా ఉన్నారు

డోన్ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని వెంకట నాయునిపల్లె సర్పంచ్ శీలం చంద్రశేఖర్ నాయుడు, డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం భాస్కర్ నాయుడు అన్నారు. గురువారం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వెంకటనాయునిపల్లెలో కరపత్రాలతో గ్రామ టీడీపీ నాయకులు

బేతంచెర్ల: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య అన్నారు. గురువారం మండలంలోని ఆర్.ఎస్.రంగాపురం గ్రామం లోని సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు.

మహాసభలను విజయవంతం చేయాలి

బేతంచెర్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ కోరారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు తిరుమలేష్, డి.దస్తగిరి, పట్టణ కార్యదర్శి పి.నాగరాజు, నాయకులు ఉదయ్, ప్రదీప్, మధు, సాయి, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు తుమ్మలపెంటలో మంత్రి బీసీ పర్యటన

కొలిమిగుండ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపెంటలో శుక్రవారం సాయంత్రం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పర్యటించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర రెడ్డి, ప్రచారకార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి వెల్లడించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో గ్రామంలో పర్యటించి, పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని తెలిపారు.

నైవేద్యాలు

- మాన్యం భూములున్నా అభివృద్ధికి నోచుకోని ఆలయాలు
- దురాక్రమణకు గురవుతున్న భూములు
- పట్టించుకోని దేవదాయ శాఖ అధికారులు

బేతంచెర్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాలకు ధూపదీప నైవేద్యాలు సైతం కరువయ్యాయి. పురాతన ఆలయాల అభివృద్ధి, మాన్యం భూముల పరిరక్షణకు ప్రభుత్వం దేవాదాయ శాఖ అధికారిని నియమిస్తుంది. పురాతన ఆలయాలకు మాన్యం భూములు ఉన్నా వాటి ద్వారా వచ్చే ఆదాయం ఎక్కడికి వెళ్తుందో తెలియదు పరిస్థితులు నెలకొన్నాయి. ఆలయాలను అభివృద్ధి చేయాల్సిన దేవాదాయ శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో నిత్య పూజలు, ధూప దీప నైవేద్యాలు అందక పురాతన ఆలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు.


ఆంజనేయస్వామి


పురాతన కోట ఆంజనేయస్వామి దేవాలయం

దాదాపు 50 ఎకరాలు

మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన కోట ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి పురాతన ఆలయాలకు 50 ఎకరాల మాన్యం భూములున్నాయి. ఏడాదికి కౌలు కింద రూ.4.90లక్షల ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం ఎక్కడికి వెళ్తుందో గానీ అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. ఆలయాల భూముల దురాక్రమణకు గురవుతున్నా దేవాదాయ శాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు భక్తులు రైతులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. నిత్య పూజలు ధూపదీప నైవేద్యాలు కూడా అందక నిరూపయోగంగా మారిపోతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇంత మాన్యం భూములున్నా ఈ దేవాలయాలను ఎందుకు అభివృద్ధి చేయడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు.

నాలుగెకరాలు అన్యాక్రాంతం?

కోట ఆంజనేయస్వామి దేవాలయం భూముల్లో సర్వే.నెం.810లో 23 ఎకరాల 35 సెంట్లు ఉంది. దేవాదాయ శాఖ అధికారులు 19 ఎకరాలు మాత్రమే కౌలుకు ఇస్తున్నారు. మిగతా నాలుగు ఎకరాల్లో మిగులు భూమి అన్యాక్రాంతమైందని పలువురు రైతులు, భక్తులు ఆరోపిస్తున్నారు. దేవాతదాయ శాఖ అధికారులు ఆ నాలుగెకరాల భూమి ఏమైందని విచారణ చేయకపోవడంతో దురాక్రమణకు గురవుతుందని దేవాలయాల అభివృద్ధిని చూసుకునే అధికారి పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. సంబంధిత దేవాదాయ శాఖ అధికారులు స్పందించ మిగతా భూమిని కూడా స్వాధీనం చేసుకుని బహిరంగ వేలాల్లో కౌలుకు ఇచ్చి ఆలయాలను అభివృద్ధి చేయాలని భక్తులు, రైతులు కోరుతున్నారు.

అభివృద్ధికి కృషి చేస్తున్నాం..

ఆర్‌ఎస్ రంగాపురంలో వెలసిన కోట ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాలకు మాన్యం భూముల నుంచి ఆదాయం వస్తున్నా.. అభివృద్ధికి నోచుకోవడం లేదని 'ఆంధ్రజ్యోతి' గ్రూప్ ఆలయాలకు చెందిన ఈవో మద్దిలేటిని వివరణ కోరింది. ఆలయాల అభివృద్ధికి 20 శాతం సీజీఎఫ్ నిధులు చెల్లించి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు.

సీమను సస్యశ్యామలం చేస్తాం

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ
- కేసీ కెనాల్ 16వ లాక్ నుంచి నీటి విడుదల

శిరివెళ్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం మండలంలోని కామినేనిపల్లె పరిధిలో ఉన్న కేసీ ప్రధాన కాల్వ 16వ లాక్ నుంచి గోవిందపల్లె, శిరివెళ్ల, కోటపాడు, యర్రగుంట్ల ప్రాంత రైతులకు సాగునీటిని ఎమ్మెల్యే విడుదల చేశారు. మొదట కెనాల్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గంగమ్మకు జల హారతి ఇచ్చి నీటిని ఉప కాల్వలకు విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, సాగునీటి సంఘాల అధ్యక్షులు సంగిరెడ్డి నాగేశ్వరరెడ్డి, చిలకల రాంపుల్లయ్య, కమతం లక్ష్మిరెడ్డి, నాయ కులు యామా గుర్రప్ప, శకుంతలమ్మ, రాంభూపాల్‌రెడ్డి, జయరామిరెడ్డి, బీసీ ఖాజా హుసేన్, బాలచంద్రుడు, ఉల్లి వెంకట సుబ్బయ్య, కేసీ కెనాల్ డీఈ రవీంద్ర, పలువురు జేఈలు, సిబ్బంది పాల్గొన్నారు.


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 3.5 కోట్ల నిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంజూరు చేశారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. గురువారం పట్టణంలోని మంగలిగేరిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ హుసేన్‌బాష, టిడిపి నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కమిషనర్ కిశోర్, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల అమ్మకాలు నిలిపివేత

చాగలమర్రి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను జిల్లా విజిలెన్స్ బృందం అధికారులు నరసింహారెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు, ఆళ్లగడ్డ ఏడీ విజయశేఖర్ తనిఖీ చేశారు. లక్ష్మీ వెంకటేశ్వర, వీరభద్రస్వామి దుకాణాలలో సరైన పత్రాలు, ఫారం-ఓలు పొందుపరచనందున రూ.2.34 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలు నిలిపేశామని విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు. ప్రతి డీలర్ తప్పనిసరిగా ఎరువులు, పురుగు మందులకు సంబంధించి అనుమతి పత్రాలు, బిల్లులు సరి చూసుకోవాలని అన్నారు. రికార్డులు, బిల్లులు సక్రమంగా లేకపోతే దుకాణల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. వారి వెంట ఏవో రంగనేతాజీ, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

దొర్నిపాడు మండల కేంద్రంలో..

దొర్నిపాడు: మండల కేంద్రంలోని ఎస్ఎం ఆగ్రో ఏజెన్సీ, విజయలక్ష్మి ఎరువులు, పురుగు మందుల దుకాణాలను స్టేట్ ఎక్స్టర్నల్ స్కార్ట్‌టీమ్ ఏడీఏ నరసింహారెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయించిన, బిల్లులు రైతులకు అందించకున్న చర్యలు తప్పవన్నారు. ఎరువులు, పురుగు మందుల రికార్డులను పరిశీలించారు. షాపులోని ఎరువుల ధరల పట్టికను తప్పనిసరిగా రైతులకు అందుబాటులో ఉంచాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ప్రమీల, సిబ్బంది ఉన్నారు.


చాగలమర్రిలో ఎరువులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


మాట్లాడుతున్న కరస్పాండెంట్ కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బేతంచెర్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కృషి పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పాణ్యం సిమెంట్స్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పాణ్యం సిమెంట్స్ జూనియర్ కళాశాల పునఃప్రారంభ కార్యక్రమానికి కాటసానితో పాటు డీఐఈవో ముఖ్యఅతిథులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కాటసాని మాట్లాడుతూ బేతంచెర్ల పట్టణంలో ఉన్నత చదువులు చదివేందుకు జూనియర్ కళాశాల లేకపోవడంతో తాను పాణ్యం సిమెంట్స్ జూనియర్ కళాశాలను బేతంచెర్లకు తీసుకువచ్చామన్నారు. డీఐఈవో శంకర్ నాయక్ మాట్లాడుతూ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి రూ.25 లక్షలతో కళాశాల అభివృద్ధి పనులను, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించారన్నారు. వచ్చే ఏడాది నుంచి పాణ్యం సిమెంట్స్ జూనియర్ కళాశాలకు పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల సౌకర్యార్థం రూ.10వేలు తాను కరస్పాండెంట్‌కు చెక్కును అందజేశారు. ప్రిన్సిపాల్ వేణుగోపాలశర్మ, ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి శాలువలతో, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బాబుల్‌రెడ్డి, రుద్రవరం నారాయణ, మురళీ కృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ రియాజుద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెజిమెంట్ యాత్ర విజయవంతం చేయాలి

కోవెలకుంట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న రెజిమెంటు యాత్రను విజయవంతం చేయాలని యాదవ సంఘం జిల్లా నాయకులు బాలుయాదవ్ కోరారు. పట్టణంలోని బాలుయాదవ్ కార్యాలయ ఆవరణంలో అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల పట్టణంలో నేటి నుంచి యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో రామచంద్రయాదవ్, నారాయణయాదవ్, జి.నాగక్రిష్ణుడుయాదవ్, శివయ్యయాదవ్, ప్రేమ్‌యాదవ్, రామభద్రుడు యాదవ, పాపన్నయాదవ్, చల్లామోహన్‌యాదవ్, క్రిష్ణమూర్తి యాదవ్, పుల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.

వర్షం పడితే కుంటలే..!

డోన్ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షం పడితే పట్టణ శివారు ప్రాంతాలు కుంటలను తలపిస్తున్నాయని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, ఐద్వా నాయకురాలు షమీమ్ భేగం అన్నారు. గురువారం పట్టణ శివారు ప్రాంతాలైన నల్లగుట్ట, శ్రీరామ్‌నగర్ తదితర కాలనీలలో నిలిచిన వర్షం నీరులో చేపలు పడుతూ వినూత్న నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్ మున్సిపాలిటీ ఏర్పడి 20 సంవత్సరాలు గడుస్తున్నా శివారు ప్రాంతాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. మున్సిపల్ పాలకులు, అధికారులు శివారు ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించకపోవడం దారుణం అన్నారు. కనీస సౌకర్యాలైన సిమెంటు రోడ్లు, ప్రధాన కాలువల సమస్యలు తిష్టవేసినా పట్టించుకునే నాథుడే లేరనీ ఆరోపించారు. పేద ప్రజలు నివసించే శివారు ప్రాంతాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తే దశల వారిగా ఉద్యమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నిలిచిన వర్షం నీరులో చేపలు పడుతూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కష్టపడిన వారికి ప్రాధాన్యం ఇవ్వండి

డోన్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు పదవులు ఇవ్వాలని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి కోరారు. గురువారం ఉండవల్లిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌బాబును ధర్మవరం సుబ్బారెడ్డితో పాటు కుమారుడు టీడీపీ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో గుండాల ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మిస్తామని ఇచ్చిన హామీను నెరవేర్చాలని మంత్రి లోకేశ్‌ను విజ్ఞప్తి చేశారు. అదే విధంగా డోన్ నియోజక వర్గంలోని ప్రస్తుత పరిస్థితుల గురించి వివరించినట్లు సుబ్బారెడ్డి తెలిపారు.


మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ధర్మవరం సుబ్బారెడ్డి, గౌతమ్ రెడ్డి

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఆళ్లగడ్డ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అహోబిలంలో నిర్వహిస్తున్న అవదూత దత్త పీఠం పాఠశాల విద్యార్థులకు అహోబిలం ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి గురువారం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశీస్సులతో పిల్లలు చక్కగా చదువుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటి కార్యదర్శి పి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ నాగసుదర్శన్, ఆర్ఎంపి వైద్యులు శ్రీనివాసులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ప్రధాన అర్చకుడు

అహోబిలం దేవస్థానం సిబ్బందికి వైద్య పరీక్షలు

ఆళ్లగడ్డ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అహోబిలంలోని ప్రభుత్వ వైద్యశాలలో గురువారం ప్రభుత్వ వైద్యాధికారి స్వాతి ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యురాలు స్వాతి మాట్లాడుతూ అహోబిలం కార్యాలయ సిబ్బందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించామన్నారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు తరచూ వైద్య పరీక్షలు చేయించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ డిప్యూటీ ఎంపీడీవోగా నాగలక్ష్మమ్మ

ఉయ్యాలవాడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉయ్యాలవాడ మండల డిప్యూటీ ఎంపీడీవోగా నాగలక్ష్మమ్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమె కోవెలకుంట్ల మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

పాదయాత్రను జయప్రదం చేయాలి

ఆళ్లగడ్డ, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 22న నిర్వహించనున్న విశ్వబ్రాహ్మణ పాదయాత్రను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రముఖ శిల్పి దురగడ్డ రవీంద్రచారి కోరారు. గురువారం పట్టణంలోని విశ్వరూపనగర్ కాళిమాత ఆలయంలో రవీంద్రాచారి అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి కడప జిల్లాలోని వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం వరకు పాదయాత్రగా వస్తున్న విశ్వబ్రాహ్మణ జన చైతన్య పాదయాత్ర ఆళ్లగడ్డకు చేరుకుంటుందన్నారు. విశ్వబ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కృష్ణమాచారి, మహిళా అధ్యక్షురాలు అనురాధ, బ్రాహ్మణ సంఘం నాయకులు విజయ్‌కుమార్ ఆచారి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం ఇవ్వండి : ఎంఈవో

చాగలమర్రి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఎంఈవో అనూరాధ సూచించారు. గురువారం మండలంలోని చింతలచెరువు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులు, విద్యామిత్ర కిట్లు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించి విద్యార్థుల సంఖ్య పెంచాలని అన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను వెలికి తీయాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, సీఆర్పీ కొండయ్య ఉన్నారు.

వైభవంగా సాయి పల్లకీ ఉత్సవం

చాగలమర్రి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని సాయినాథ మందిరంలో సాయి పాదుకల పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం ఆలయంలో సాయిబాబాకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా సాయివ్రతం వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుబ్బారావు, నాగభూషణం, రఘురామ్, మహిళలు పాల్గొన్నారు.

హైవేలో లారీ బోల్తా..

చాగలమర్రి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేసీ కెనాల్ సమీపంలోగల ఇడమడక చెక్‌పోస్టు వద్ద ఉల్లిగడ్డ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి గురువారం బోల్తాపడింది. హర్యాన నుంచి చెన్నైకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు రహదారిపైనే బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లినర్ ప్రాణాపయం నుంచి తప్పించుకున్నారు. రహదారిపై ఉల్లిగడ్డ బస్తాలు చెల్లా చెదురుగా పడిపోయి నష్టం వాటిల్లింది. టోల్‌ప్లాజా సిబ్బంది రాకపోకలకు అంతరాయం కలుగకుండా తగు చర్యలు తీసుకున్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యం

చాగలమర్రి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యమని ప్రత్యేక అధికారి అనూరాధ తెలిపారు. గురువారం మండలంలోని చింతలచెరువు గ్రామంలో పీ-4 గ్రామసభ నిర్వహించారు. 56 బంగారు కుటుంబాల జాబితాను కార్యదర్శి నాగార్జున సభలో చదివి వినిపించారు. టీడీపీ నాయకులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీ-4 లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై విచారణ

చాగలమర్రి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు, మల్లేవేముల, డి.వనిపెంట, పెద్దవంగలి, చిన్నబోధనం, గొడిగనూరు గ్రామాల్లో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ డీఆర్పీలు విచారణ చేపట్టి ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ముత్యాలపాడు 277 పనులకు రూ.1.48 కోట్లు, మల్లేవేములలో 51 పనులకు రూ.1.15 కోట్లు, డి.వనిపెంటలో 113 పనులకు రూ.93.24 లక్షలు, పెద్దవంగలిలో 71 పనులకు రూ.35 లక్షలు, చిన్నబోదనంలో 79 పనులకు రూ.35.90 లక్షలు, గొడిగనూరులో 68 పనులకు రూ.43.76 లక్షలు ఉపాధి నిధులు ఖర్చు చేశారని రాష్ట్ర రిసోర్స్ పర్సన్ భాస్కర్ తెలిపారు. ఈ నిధులపై ఆయా గ్రామాల్లో విచారణ చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నివారణకు టీకా తప్పనిసరి

చాగలమర్రి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ముద్దచర్మ వ్యాధి నివారణకు ఆవులు, ఎద్దులకు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. గురువారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారుడికి సత్కారం

బనగానపల్లె, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు రామాలయంలో బాలసరస్వతి భజన మండలి సహకారంతో కళాకారుడు, హార్మోనిస్టు హనుమంతును జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. కార్యక్రమంలో పూజారి రాఘవయ్య, కెఈ.వెంకటసుబ్బయ్య గౌడ్, మాణిక్యాచారి, శ్రీనివాసులు, మహేశ్ పాల్గొన్నారు.

రామ్‌కో వైద్య సేవలు అభినందనీయం

కొలిమిగుండ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో సమీప గ్రామాల ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని కల్వటాల గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య బిబిరాన్ని తహసీల్దార్ పరిశీలించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఆలయ పునఃప్రతిష్ఠ ఏర్పాట్ల పరిశీలన

కొలిమిగుండ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను సీఐ రమేష్‌బాబు, రామ్‌కో ప్రతినిధులు గురువారం పరిశీలించారు. వాహనాల పార్కింగ్, అన్నదానం, భక్తుల క్యూలైన్లు తదితర అంశాలపై చర్చించారు. రామ్‌కో ప్రతినిధులు ఎలక్ట్రికల్ డీజీఎం రమేష్, చంద్రశేఖరరావు, వెంకటరమణ పాల్గొన్నారు.